www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 డిసెంబర్ 2025 5 పశ్చిమ గోదావరి

హస్త కళలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక

ప్రజాశక్తి - నరసాపురం

హస్త కళా ఉత్పత్తులు అలంకరణకే కాకుండా రోజువారీ వినియోగంలో ఉండే విధంగా రూపొందించి తీసుకురావడం గొప్ప విషయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని రుస్తుంబాద లేసు ట్రేడింగ్ సెంటర్‌ను మంగళవారం ఎంపీ పాకా సత్యనారాయణ, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి మంత్రి నిమ్మల సందర్శించారు. సెంటర్లో వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. హస్తకళల తయారీ, ఎగుమతులు, వస్తున్న ఆదాయం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం వల్ల దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీగా హస్తకళలు నిలుస్తాయన్నారు. జ్యువెలరీ, గృహోపకరణాలు, ఫర్నీచర్, లేసు ఉత్పత్తులు, కలంకారీ వస్త్రాలు, హ్యాండ్ బ్యాగ్స్, రెడీమేడ్ వస్త్రాలు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్నాయన్నారు. ట్రేడింగ్ నిర్వాహకులు కలవకొలను తులసి, రాకేష్ శర్మ, గన్నాబత్తుల సత్యవతి పాల్గొన్నారు.

నాడు పట్టాలిచ్చి.. నేడు కూల్చుతామంటారా

పెద్దల కోసం టిడిపి ప్రభుత్వ వైఖరి సరికాదు

నోటీసులు వెనక్కి తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌తో కలిసి ఇంటి పట్టా చూపుతున్న బాధితులు

ప్రజాశక్తి - ఆకివీడు

కొద్దిమంది పెద్దల ప్రయోజనాల కోసం పేదల ఇల్లు ఖాళీ చేయించే ప్రయత్నం హేయమైన చర్య అని, ఇది ఎంతమాత్రం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ఆకివీడు కోళ్లపర్రు గ్రామ పరిధిలో చినకాపవరం డ్రైయిన్ గట్టుపై ఏళ్లతరబడి ఉంటున్న ఇళ్లను తొలగించాలని ఆకివీడు కోళ్లపర్రు గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసింది. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, నేతలు మంగళవారం సాయంత్రం కోళ్లపర్రులోని బాధితుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు ఆయనతో మాట్లాడారు. సుమారు మూడు దశాబ్దాల క్రితమే తమకు నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ స్థలాలకే పట్టాలిచ్చారన్నారు. ఆ ధైర్యంతోనే శాశ్వత నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో పట్టాలివ్వగా, నేటి కూటమి ప్రభుత్వం ఆ పట్టాల భూముల్లోని ఇళ్లను కూలగొడతామంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఈ విధానం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఇల్లు కూల్చడానికే వచ్చిందా అని ప్రశ్నించారు. కొందరు పెద్దల కోసం పేదల నివాసాలు కూల్చేయడాన్ని ఎంతమాత్రం అంగీకరించబోమని ఆయన హెచ్చరించారు. వెంటనే అధికారులు పేదలకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిపిఎం ఏరియా కన్వీనర్ కె.తవిటినాయుడు, నాయకులు సాకా కిసింజర్ ఉన్నారు.

నిశిరాత్రి ఘోరం

గోడను ఢీకొన్న బైక్ : ముగ్గురు యువకులు దుర్మరణం

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని వస్తుండగా ఘటన

మితిమీరిన వేగం, మద్యం మత్తు కారణమని అంచనా

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరులో సోమవారం అర్ధరాత్రి ఘోరం చోటుచేసుకుంది. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఇళ్లకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి గోడను ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని పొలమూరు గ్రామంలో చర్చి వద్ద క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి జరిగాయి. ఆ వేడుకల్లో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన ఏలేటి రాజు (22), ఏలేటి అంజిబాబు (అంజి) (25), కోళ్ల సత్యనారాయణ (20) ఒకే బైక్‌పై ఇళ్లకు బయల్దేరారు. వీరి బైక్ బస్టాండ్ ప్రాంతం దాటుతున్న క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కూరగాయల దుకాణాన్ని ఢీకొని, ఆపై పక్కనున్న టిప్‌టాప్ దుకాణం ప్రహరీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో బ్రాహ్మణచెర్వు సమీపంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ముగ్గురు యువకులు మృతి చెందారు. దీంతో ఆ మృతదేహాలను ప్రయివేటు వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామం నడిబొడ్డున ప్రమాదం జరగడం, మృతులంతా అదే గ్రామానికి చెందిన వారు కావడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. పెనుగొండ సిఐ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంజిబాబు (ఫైల్‌ఫొటో)

రాజు (ఫైల్‌ఫొటో)

సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

భార్య నిండు గర్భిణి

ప్రమాదంలో మృతులైన అంజిబాబు, రాజు అన్నదమ్ముల బిడ్డలు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసే అంజికి భార్య, ఒక కుమార్తె ఉంది. భార్య ప్రస్తుతం నిండు గర్భిణి. జనవరి పదో తేదీకి ప్రసవమవుతుందని వైద్యులు చెప్పిన క్రమంలో భర్తను కోల్పోయి ఆ గర్భిణి రోదిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది. అంజి తల్లి గల్ఫ్‌లో ఉంటున్నట్లు, కుమారుడు మృతి సమాచారం తెలియగానే స్వదేశానికి బయల్దేరినట్లు సమాచారం.

ఇక రాజు స్థానిక పెట్రోల్ బంకులో పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. రాజు తండ్రి భాస్కరరావు టిడిపిలో చురుగ్గా ఉంటారు. పెళ్లి కావాల్సిన కుమారుడు కాటికెళ్లాడంటూ ఆ కుటుంబం బోరున విలపిస్తోంది.

ఒక్కగానొక్క కొడుకును కోల్పోయి..

టెన్త్ తర్వాత ఐటిఐ చేసిన కోళ్ల సత్యనారాయణ (20) ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తండ్రి నాగరాజు వ్యవసాయ కార్మికుడు. సత్యనారాయణ స్నేహితులైన రాజు, అంజి వెంట వెళ్లి మృత్యుపాలవ్వడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతోంది.

అతివేగం.. మద్యం మత్తు కారణమా?

గ్రామంలో అర్ధరాత్రి వేళ జన సంచారం తక్కువగా ఉంటుంది. పైగా సిమెంట్ రోడ్డు కావడంతో బైక్‌ను మితిమీరిన వేగంతో నడిపినట్లు తెలుస్తోంది. యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఏదేమైనా వేగం, మత్తు మూడు కుటుంబాలను చిన్నాభిన్నం చేసిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజలకు న్యాయమైన సేవలందించాలి

రెవెన్యూ అధికారులు మరింత సమర్ధవంతంగా పని చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు రెవెన్యూ అధికారులు మరింత సమర్ధవంతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కాలువ గట్లు, రోడ్డు మార్జిన్లు ఆక్రమించుకుని ఆలయాలు, విగ్రహాల ఏర్పాటును రెవెన్యూ అధికారులు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం ఆమె జిల్లాలోని రెవెన్యూ అధికారులతో పిజిఆర్ఎస్, 22ఎ భూములు, ఐవిఆర్ఎస్, రీసర్వే, కోర్టు కేసులు, మ్యూటేషన్, ఇళ్ల నిర్మాణం, రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. పిజిఆర్ఎస్, 22ఎ కేసుల పరిష్కారానికి తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భూసమస్యలపై అధికంగా వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని సూచించారు. జనవరి నుండి ప్రతివారం మండలాల్లో పర్యటించి సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తానన్నారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ఐదు చౌకడిపోలను తనిఖీ చేసి పంపిణీ విధానాన్ని, నాణ్యతను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎమ్‌డి.ఇబ్రహీం, డిఎస్ఒ ఎన్.సరోజ, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

విబి జిఆర్ఎంఎం జి బిల్లును ఉపసంహరించుకోవాలి

పెర్కిపాలెంలో విబి జిఆర్ఎఎంజి ప్రతులను దహనం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబి జి ఆర్ఎంఎం జి పథకం బిల్లు ప్రతులను సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యాన పెర్కిపాలెంలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు ఎం.ఆంజనేయులు, బొర్రా అలమహారాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పోరాటాల ద్వారా వచ్చిందని, వంద రోజులు పని గ్యారంటీ ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పేదల పొట్ట కొట్టేలా పథకం పేరుతోపాటు నిబంధనలు మార్చిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా మరింత పటిష్టవంతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బొక్కా కూర్మారావు, దానేశ్వరి, కోరసిక శ్రీను, డొక్కు రామాంజనేయులు, గుబ్బల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో..

పెంటపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని కోరుతూ బల్లిపాడులో బిల్లు కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల ఉపాధి హక్కును హరించేలా తీసుకువచ్చిన ఈ బిల్లుకు మన రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలు అనుకూలంగా ఓటు వేయడం దుర్మార్గమని విమర్శించారు. 2005లో అనేక పోరాటాల ద్వారా వచ్చిన విప్లవాత్మకమైన ఉపాధి హామీ చట్టాన్ని తుంగలో తొక్కి ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద కొనసాగే పథకంగా మార్చడం దారుణమన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని, ప్రతి కుటుంబానికీ రెండొందల రోజులు పని కల్పించాలని, రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు తానికొండ సుష్మ, జోషి భాయ్, మార్తమ్మ, ప్రేమావతి, కొల్లి శ్రీను, సావిత్రి, తానికొండ జ్యోతి పాల్గొన్నారు.

అత్తిలి: గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్లో ఆమోదించిన విబి జిఆర్ఎంఎం జి బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని ఎపి కౌలు నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించి పేదల ఆకలి చావులు నివారించాలన్నారు. కార్యక్రమంలో గంట కోటి, దత్తు రాము, పెనగంటి దుర్గ, బర్ల బాలాజీ, మాదాసు రాజు, పూడి బాలాజీ, మద్దాల సత్యనారాయణ, సత్తిరెడ్డి సూరి, గాలి శివ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో..

రైతులు ఆందోళన చెందొద్దు

జిల్లాలో సరిపడా అందుబాటులో యూరియా నిల్వలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రబీ సీజన్‌కు సరిపడినంత యూరియా నిల్వలు సొసైటీలు, ఆర్ఎస్‌కెలు, ప్రయివేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళనా చెందొద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎంఆర్‌పి కన్నా ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. యూరియాకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్ నుండి మంగళవారం ఎరువుల లభ్యత, వినియోగం, క్షేత్రస్థాయి సమస్యలు, రైతుల సందేహాల నివృత్తిపై ఆయన ఎడిఎలు, ఎంఎఒలు, విఎఎలు, ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జిలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. సొసైటీలు, ఆర్ఎస్‌కెల్లో రాబోయే 20 రోజులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లించినా, ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాధవరం, నవాబ్‌పాలెం, పెంటపాడు, పడమర విప్పర్రు, తణుకు, పెనుమంట్ర, పెనుగొండ ఆర్ఎస్‌కెల నుండి హాజరైన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతూ ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు, యూరియా కొనుగోలుపై ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు, సొసైటీలు, డీలర్ల వల్ల ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా తదితర అంశాలపై రైతులతో మాట్లాడారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎడిఎలు, ఎంఎఒలు, విఎఒలు, రైతుసేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిఎంఆర్ కళాశాలలో ఉద్యోగమేళా

120 మంది ఎంపిక

మాట్లాడుతున్న సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.లోకమాన్ తెలిపారు. స్థానిక యువతీ యువకులకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ డెవలప్మెంట్), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సిఎస్) ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ వాసవి జిఎంఆర్ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ పి.లోకమాన్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో యాక్సిస్ బ్యాంక్, కియా మోటార్స్, శ్రీ సత్యనారాయణ స్పిన్ మిల్స్, ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మా, ఎంఆర్ఎఫ్, ఎన్ఐసి, రాజేంద్ర ఎనర్జీ పవర్, హీరో మోటార్ మొదలైన కంపెనీలు పాల్గొన్నాయన్నారు. దీనికి 350 మంది యువతీ యువకులు హాజరవ్వగా 120 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వివిఎన్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యం అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ అభినందించారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ అధికారి ఎం.కిషోర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ నరసింహారావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ వివిఎన్.శ్రీనివాస్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ప్లేస్‌మెంట్స్ అధికారి శ్రీనివాస్, కళాశాల కోఆర్డినేటర్ ప్రసన్న, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ఒకరోజు ఆప్షనల్ హాలిడే ప్రకటించాలి

ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకూ వెసులుబాటు కల్పించాలి

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం

అత్యంత ప్రతిష్టాత్మకంగా క్రైస్తవులు జరుపుకునే క్రిస్మస్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 24వ తేదీనగాని, 26వ తేదీనగాని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే 25వ తేదీ పబ్లిక్ హాలిడేగా ప్రకటించగా, 24వ తేదీ ఆప్షనల్ హాలిడేగా ఉందని, అయితే అవకాశం బట్టి 26వ తేదీని కూడా ఆప్షనల్ హాలిడే తీసుకునే విధంగా అవకాశం కల్పించాలని ప్రభుత్వం, విద్యాశాఖలను కోరారు. గతంలో మాదిరి ఆప్షనల్ హాలిడేస్ పూర్తి సెలవు దినాలుగా పాఠశాలలకు ప్రకటించాలని, దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు కూడా సెలవు ప్రకటించాల్సిన ఆవశ్యకత గుర్తు చేశారు. ఒక పండుగ వస్తే పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందరికీ సెలవు ఇవ్వడం అనేది గత 30 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కొన్ని పండగలకు సెలవులు ఇచ్చి, కొన్ని పండుగలకు సెలవులు ఇవ్వకుండా ఉండటం వల్ల కల్మషం లేని విద్యార్థుల మనసుల్లో మరో భావాలు రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. క్రిస్మస్ సమయంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు లేకుండా బాక్సింగ్ డేకు సంబంధించి ఒకరోజు పండుగను జరుపుకునే ప్రాంతాల్లో లోకల్ హాలిడేగా ప్రకటించాలని కోరారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

సీతారామపురం సొసైటీలో ఉచిత కంటివైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం సొసైటీ ఆధ్వర్యాన సొసైటీ ప్రాంగణంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రజలందరూ ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కంటి సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణులకు వైద్య సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి ఉచిత మందులు అందించారు. కార్యక్రమంలో సీతారామపురం సొసైటీ అధ్యక్షులు కలవకొలను తాతాజీ, మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారక రామారావు, వలవల నాని, ఎఎంసి వైస్ ఛైర్మన్ దేశనీడి గంగాధర్, కటకంశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

రాయకుదురు విద్యార్థికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - వీరవాసరం

స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న జి.సాయిసుజిత్, డి.జయసాయి ప్రథమ బహుమతి సాధించారు. వీరిని మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఎడారిలో మంచు నుండి నీటిని సాంద్రీకరించడం అనే అంశంపై ప్రదర్శించిన ప్రాజెక్టుకు వీరు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఇదే ప్రాజెక్టును విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తయారీలో విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చిన ఉపాధ్యాయులు గజేంద్ర గడ్కార్, తులసీరత్నమణి, ఆకుల శ్రీనివాస్, లక్ష్మీదుర్గలను ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

వీరవాసరంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న రాయకుదురు విద్యార్థులు

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న మునిస్వామి

ప్రజాశక్తి - ఇరగవరం

స్త్రీ శక్తి పథకంపై ఆలిండియా సిఐటియు మహాసభలో చర్చిస్తామని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి అన్నారు. ఆలిండియా సిఐటియు మహాసభ జయప్రదం చేయాలని రేలంగి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కామన మునిస్వామి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినాటి నుండి కార్మిక చట్టాలను మార్చేస్తోందని తెలిపారు. కనీస వేతనాలు అమలు కావడం లేదని, పని గంటలు మార్పు చేశారని, వీటన్నింటిపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల పొట్ట కొట్టారని విమర్శించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సులు నడపడం వల్ల ఆటో కార్మికులకు కిరాయిలు లేక పస్తులతో కాలం గడుపుతున్నారని తెలిపారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇలంధపర్తి సత్యనారాయణ, ఎం.నాగరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం వాసి జాతీయ స్థాయిలో నిలిచి

కరాటే పోటీల్లో మెరిసిన ఆహిల్

జాతీయస్థాయిలో నిలిచిన ఆహిల్‌తో కోచ్ సుభాన్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం వాసి కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అండర్-14 బాలికల కరాటే విభాగంలో 21 మంది పోటీ పడ్డారు. దీనిలో భీమవరం ఛాంపియన్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన ఎస్.ఆహిల్ 40 కేజీల విభాగంలో జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. 69వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించడం జరిగింది. జాతీయస్థాయిలో మూడో స్థానం గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఛాంపియన్ స్పోర్ట్స్ అకాడమీ అధినేత కోచ్ ఎస్.సుభాన్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత మంది భీమవరం నుంచి జాతీయస్థాయికి వెళ్లే విధంగా వారికి తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

సమస్యల వెలికితీతలో ప్రజాశక్తి కృషి అభినందనీయం

క్యాలెండర్ ఆవిష్కరణలో జెడిపిటిసి కర్రి గౌరీ సుభాషిణి

ప్రజాశక్తి - పెనుమంట్ర


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడిపిటిసి

ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయడంలో ప్రజాశక్తి దినపత్రిక ముందు వరుసలో ఉందని జెడిపిటిసి సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి వేణుబాబు అన్నారు. మార్టేరులోని తన కార్యాలయంలో ఆమె ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్యాలెండర్ అత్యంత ఆకర్షణీయంగా ఉందని ప్రశంసించారు. రానున్న రోజుల్లోనూ అవినీతి వ్యతిరేకంగా, ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చేలా కృషి సాగించాలని ఆకాంక్షించారు.

ఐరిష్‌తో తెల్ల రేషన్ కార్డుదారులకు లబ్ధి

ఐరిష్ పరికరాలను అందజేస్తున్న డిటి

ఉండి: ఐరిష్ విధానంతో తెల్ల రేషన్ కార్డుదారులకు మరింత లబ్ధి చేకూరుతుందని డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు ఐరిష్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు బయోమెట్రిక్ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసేవారని, వేలిముద్ర పడకపోతే సంబంధిత వీఆర్‌ఓ వేలిముద్ర వేయాల్సిన పరిస్థితి ఏర్పడేదని తెలిపారు. వీఆర్‌ఓలకు వీలు కాకపోతే ఆ రేషన్ కార్డుదారునికి రేషన్ అందే అవకాశం లేకుండా పోయేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి ప్రతి ఒక్కరికీ రేషన్ అందాలనే ఉద్దేశంతో వేలిముద్రపడని వారికి ఐరిష్ విధానంలో రేషన్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ అడ్డంకి బాబీ, రేషన్ డీలర్ కొమ్మన నాగబాబు, బీఏపి సింహాచలం ఉన్నారు.

అనధికారిక కుళాయి కనెక్షన్లపై ఫిర్యాదు

కాళ్ల: సీసలిలో అనధికారిక కుళాయి కనెక్షన్లకు గాను ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును సర్పంచి, పంచాయతీ పాలక వర్గం, గ్రామ కార్యదర్శులు గ్రామ పంచాయతీకి జమ చేయలేదని మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా పంచాయతీ అధికారి, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సీసలి గ్రామ పంచాయతీ ప్రస్తుత సర్పంచి బిల్లకుర్తి ధనలక్ష్మి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శులు కలిసి గ్రామంలో అనధికారంగా సుమారు 500 కుళాయి కనెక్షన్లు ఇచ్చి సుమారు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల వరకూ ఇప్పటివరకూ ప్రజల నుండి డబ్బులు వసూలు చేసి గ్రామ పంచాయతీకి జమ చేయకుండా పంచాయతీ ఆదాయానికి తీవ్ర నష్టం కలుగజేశారని తెలిపారు. గ్రామంలో ప్రస్తుత పాలకవర్గం చేస్తున్న ఈ అక్రమాలతో సీసలి గ్రామ పంచాయతీ ఆదాయానికి తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. తక్షణం వారిపై విచారణ చేయాలని, గ్రామ పంచాయతీకి ఆదాయం చెల్లించాలని, చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు.

డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్‌కు

నాలుగు అవార్డులు

భీమవరం: ఈ నెల 20, 21వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో భీమవరం డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్‌కు నాలుగు అవార్డులు లభించాయి. జిల్లాలో సెకండ్ బెస్ట్ క్లబ్ అవార్డు, బెస్ట్ సర్వీస్ క్లబ్ అవార్డు, అప్రిసియేషన్ అవార్డు, క్యాష్ అవార్డులు లభించాయి. 50 నుంచి 60 వయస్సు పురుషుల నడక పోటీలో అసోసియేషన్ సభ్యుడు బొమ్మిడి శ్రీనివాసరావు ప్రథమ బహుమతి పొందారు. అధ్యక్షులు కలిశం పల్లారావు, కార్యదర్శి పోతంశెట్టి సీతారామరాజు, కోశాధికారి కనగర్ల విజయరామ కృష్ణ, ఉపాధ్యక్షులు త్యాగరాజు, వెంకట్రాజు, సీసలి రాము, అడపా బాబ్జి, అప్పలరాజు, సూర్యప్రకాష్, ఎస్ఎస్ఆర్.రాజు మార్నింగ్ వాక్ క్లబ్ సభ్యులు బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఒలేటి శ్రీనివాస్, కె.సత్యనారాయణ మూర్తి, సైకిల్ క్లబ్ సభ్యులు అజయ్‌కుమార్, పెదకాపు, ప్రొఫెసర్ సుబ్బారావు తెలిపారు.

శరవేగంగా లేబరేటరీల నిర్మాణం

ఉండి: ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ పథకంలో భాగంగా రూ.65 లక్షలతో నిర్మించే అధునాతన లేబరేటరీలు వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.రామలక్ష్మి అన్నారు. పనులను పర్యవేక్షించిన అనంతరం ఆమె మాట్లాడుతూ 107 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మరిన్ని సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యా బోధన చేయాలనే ఉద్దేశంతో అవసరమైన లేబరేటరీలు నిర్మించేందుకు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ లేబరేటరీలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే క్రీడా మైదానానికి రూ.ఐదు లక్షలు, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసేందుకు మరో రూ.5 లక్షల నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

ప్రజాశక్తి - ఉండి

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని టిడిపి మండల అధ్యక్షులు కమిలెంక నాగరాజు అన్నారు. మంగళవారం ఉండి మసీదు వద్ద నుంచి మెయిన్ సెంటర్‌కు వచ్చే కాలువ గట్టు రహదారి అభివృద్ధి పనులను నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 13 లక్షల రూపాయల వ్యయంతో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆదేశాల మేరకు కాలువ గట్టు రోడ్డు అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఇదే విధంగా ప్రభుత్వ కాలనీకి వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండడంతో వాటిని సైతం అభివృద్ధి చేసి కాలనీవాసులకు నాణ్యమైన రహదారులను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఉనుదుర్రు - పాందువ్వ అంతర్గత రహదారి సైతం ఐదేళ్ల అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. అధ్వానంగా ఉన్న ఉండి బస్టాండ్ ప్రాంగణాన్ని సైతం ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టామని, సంక్రాంతి నాటికి పూర్తి స్థాయిలో ఉండి బస్సు స్టాండ్ ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ పరిశీలనలో టిడిపి నాయకులు గండం శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్, కమిలెంక చినబాబు, సారేపల్లి త్రిమూర్తులు, సిపిఐ ఏరియా కార్యదర్శి వెంకట్రావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని, వాటి పరిష్కారంలో అధికారులు సహకరించాలని ఎంపిపి కటారి రాజ్యలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సుమారు రెండు గంటల పాటు పలు శాఖల అధికారులతో జరిగిన సమీక్ష అనంతరం ఆమె మాట్లాడారు. ప్రస్తుతం శీతాకాలం నేపథ్యంలో గ్రామాల్లో దోమల సమస్య ఎక్కువగా ఉంటోందని వాటి నివారణకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. అందరం కలిసి ప్రజా సమస్యలు పరిష్కరిద్దామని ఆమె చెప్పారు. ఎండిఒ బాబూరావు మాట్లాడుతూ యాజమాన్యపు హక్కు పత్రం కార్డు రూపంలో స్వమిత్వ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తుందని, అవి అర్హులైన వారికి అందించాలని సభ్యులను కోరారు. పుట్టినరోజు ఆధారంగా భూ యజమానులకు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఆయా శాఖల పనితీరును గురించి ఆయన వివరించారు. జెడ్‌పిటిసి సభ్యురాలు కోడూరి వెంకటరత్నం మాట్లాడుతూ గ్రామాల పారిశుధ్యానికి పంచాయతీలకు కనీసం జనరల్ నిధులు కూడా విడుదల కావడం లేదని కార్యదర్శులు ఆగిపోతున్నాయన్నారు. కొమ్మూలూరు ఎంపిటిసి కొప్పెల్ల రాంబాబు మాట్లాడుతూ పాంగింగ్ మిషన్లు మూలన పడ్డాయని, వాటిని ఉపయోగించే విధానం ఆలోచించాలని సూచించారు. పలు శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఖరగ్‌పూర్ నాటకపరిషత్‌కు న్యాయ నిర్ణేతగా సత్యనారాయణ

పాలకొల్లు: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఖరగ్‌పూర్‌లో ఆంధ్రా నవ్య కళాపరిషత్ 69వ వార్షిక జాతీయస్థాయి నాటిక పోటీలకు పాలకొల్లుకు చెందిన మానాపురం సత్యనారాయణ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఖరగ్‌పూర్‌లోని రైల్వే ఉద్యోగులు ఒక సంస్థగా ఏర్పాటు చేసుకుని దాదాపు 68 సంవత్సరాల క్రితం ఈ నాటిక పోటీలు ప్రారంభించారు. అత్యంత వైభవంగా పోటీలు నిర్వహిస్తున్నారు. 2 రోజులపాటు 7 నాటికలు ప్రదర్శించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పాలకొల్లుకు చెందిన మానాపురం సత్యనారాయణ, ఐత్రీస్‌పూర్ రాష్ట్రం బిలాయ్‌కు చెందిన అంగర రుద్రమూర్తి, కలకత్తాకు చెందిన బల్ల ప్రకాష్‌రావు వ్యవహరించారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవ సంస్థ కార్యదర్శి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మానాపురం సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. దీనిపై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు, వారోటి శ్రీనివాసరావు, పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కెఎస్ కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావు, చౌదరి ఉపాధ్యక్షులు కెఎస్ఎన్.మూర్తి, విటుకుల రమణ తదితరులు అభినందించారు.

శిథిలావస్థలో జల్లికొమ్మర సొసైటీ భవనం

భయంతో విధుల నిర్వహణ - నూతన భవనం నిర్మించాలని డిమాండ్

ప్రజాశక్తి - గణపవరం

శిథిలావస్థకు చేరిన కొమ్మర సొసైటీ భవనం

మండలంలో జల్లి కొమ్మర సొసైటీ భవనం శిథిలావస్థకు చేరింది. అయితే నూతన భవన నిర్మాణం చేయకపోవడంతో సొసైటీ ఉద్యోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. సొసైటీ భవనం నిర్మించి 90 సంవత్సరాలు అయ్యిందని, భవనం పడిపోయేలా ఉన్నా ప్రభుత్వం నూతన భవన నిర్మాణంపై దృష్టి పెట్టని పరిస్థితి. దీంతో తప్పని పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సొసైటీ పరిధిలోని కొమ్మర, వెలగపల్లి గ్రామాలకు చెందిన రైతులకు సేవలందిస్తున్న సొసైటీ భవనం శిథిలావస్థకు చేరినప్పటికీ అధికారులు కొత్త భవనం నిర్మాణంపై దృష్టి పెట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. సొసైటీలో ఆరుగురు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వెంటనే నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సొసైటీ ఛైర్మన్ మద్దాల మహింకాళి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ వారి ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా అన్ని శాఖల అధికారులనూ సమన్వయం చేసుకుని రైతులకు అన్ని విధాలుగా సహకారంగా ఉంటున్నారని తెలిపారు.

పాలకొల్లు: పట్టణంలోని జివిఎస్‌విఆర్ మున్సిపల్ మోడల్ ప్రయిమరీ స్కూల్లో కిసాన్ దివాస్ (జాతీయ రైతు దినోత్సవం) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి కృషి చేసిన మహనీయులు ఎందరో ఉన్నారని, అటువంటి వారిలో రైతు బాంధవునిగా పేరుపొందిన (మాజీ ప్రధాని) చౌదరి చరణ్ సింగ్ ఒకరిని తెలిపారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం కిసాన్ దివాస్‌గా ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు చిలుకూరి శ్రీనివాసును విద్యార్థులు ఘనంగా సత్కరించి చిరు జ్ఞాపకను అందించారు. ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మధుసూధన రెడ్డి, రోజా, లీలా కుమారి పాల్గొన్నారు.

పెనుమంట్ర : రైతుల ఆత్మ బంధువు చౌదరి చరణ్ సింగ్ జయంతిని జాతీయ రైతు దినోత్సవంగా జరపడం రైతు లోకాన్ని గౌరవించడమేనని ఆచార్య ఎన్‌జి జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఉప సంచాలకులు టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ అండ్ ఎడిఆర్ టి.శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా చౌదరి చరణ్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం రైతులను సన్మానించి వారికి వ్యవసాయ పంచాంగం పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని శాస్త్రవేత్తలు, సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ బోధనా బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరవాసరం కాపు వనితా క్లబ్, కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో రైతులు రాళ్లపల్లి కృష్ణారావు, బొడ్డు సత్యనారాయణ, ఆదిరెడ్డి కృష్ణారావును సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ రైతు దినోత్సవాన్ని మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ పుట్టిన రోజున జరుపుతున్నారన్నారు. క్లబ్ ప్రెసిడెంట్ బి.లక్ష్మి, సెక్రటరీ ముఖమట్ల దుర్గాప్రసాద్, అల్లంశెట్టి అన్నపూర్ణ, ఎల్.నలిని, కుంచే.వేణు, గుండా స్వాతి పాల్గొన్నారు.

ఉండి : వరి రైతులతో పాటు ఆక్వా రైతులకు కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధర నిర్ధారించి నష్టాలు బారిన పడకుండా ఆదుకోవాలని ఎంపెడా టెక్నికల్ ఆఫీసర్ జె.దుర్గారావు సూచించారు. మంగళవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త ఎన్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మత్స్య పరిశోధన సంస్థ అధిపతి చంద్రశేఖర్ మాట్లాడారు. మత్స్య రైతులను ప్రోత్సహించాలంటే ఆక్వా సాగు కేవలం విదేశాలకు ఎగుమతి చేయడమే కాకుండా దేశీయంగా కూడా వినియోగించాలని అన్నారు. దేశీ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తేనే ఆక్వా రైతు మనుగడ ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ రైతులను సత్కరించారు ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు దెబోరా మెస్సియానా, శ్రీనివాసరావు, వినయ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - యలమంచిలి

జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డి.శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయం మిషన్ వాత్సల్య వారి ఆధ్వర్యంలో బాల్ వివాహ ముక్త్ భారత్ - 100 రోజుల కాంపెయిన్‌లో భాగంగా మండలంలోని చించినాడ హైస్కూల్, కాజా ఈస్ట్ హైస్కూల్‌లో బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత సేవల రక్షణ అధికారి పి.మమతశ్రీ విద్యార్థులకు బాల్య వివాహ నిషేధ చట్టం - 2006పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. జిఒ ఎంఎస్ 13, జిఒ ఎంఎస్ 31, జిఒ ఎంఎస్ 39 గురించి విద్యార్థులకు వివరించారు. పాలకొల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఉమా మాట్లాడారు. బాలల హక్కులైన జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. విద్యార్థులందరూ ఎటువంటి ప్రేమ ఆకర్షణలకు లోనుకాకుండా నైతిక విలువలను పెంపొందించుకొని తల్లిదండ్రులు, టీచర్లు, తోటి వారి పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. బాలలకు ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పాలకొల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎంఎస్.పద్మావతి, స్కూల్ హెచ్ఎం, టీచర్లు, జిఎంఎస్‌కె, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ, అంగన్వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పలు చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

ఏసు క్రీస్తు జన్మ మానవాళికి శాంతి, ప్రేమ, కరుణ వరాలను ప్రసాదించిందని ఎపిసిపిఎ ఫౌండర్, చర్చి పాస్టర్ ఎండి ఇస్మాయేల్ అన్నారు. ఏలూరుపాడులో జీసస్ క్రిస్ట్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన బ్రదర్ ఎల్.రాజు మాట్లాడారు. అనంతరం క్రైస్తవ మతపెద్దలు, పాస్టర్లతో కలిసి క్రిస్మస్ కేక్‌ను ఇస్మాయేల్ కట్ చేశారు. ఈ వేడుకల్లో ఎపిసిపిఎ పొలిటికల్ ప్రెసిడెంట్ రాజేష్ కన్నా, వైస్ ప్రెసిడెంట్ యోవేలు రాజు, కలవపూడి పాస్టర్ జి.రవిబాబు, ఎపిసిపిఎ జిల్లా ప్రెసిడెంట్ బుల్లెట్ కిట్టు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పర ధర్మాన్ని గౌరవించాలని విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలూ సమానమేనని, అందరూ కలిసి కట్టుగా క్రీస్తు చూపించిన ప్రేమ మార్గంలో ముందుకు నడవాలని తెలిపారు. పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్, ఆర్‌డిఒ కౌసర్ భానో, తహశీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ మేనేజర్ రవి సుధాకర్, ఎంఇ వై.వెంకటరమణ, ఎఎస్ఒ సురేష్, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం పిప్పరలో రూ.75 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ప్రస్తుతం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఎపి కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్ధవరంలో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, కూటమి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

పాలకొల్లు: బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, పూర్తి సమయాన్ని విద్యార్థులకు కేటాయించేలా ఆదేశాలివ్వాలని యుటిఎఫ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎంవిఎస్ఆర్‌సి హెస్.శ్రీనివాసరావు, కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. యుటిఎఫ్ పట్టణ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని వారు తెలిపారు.

ఘనంగా లూథరన్ చర్చి వార్షికోత్సవం

నరసాపురం : రుస్తుంబాదలోని మంగళగుంటపాలెం ప్రాంతంలో సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి 14వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సేవా భావానికి ప్రతీక అన్నారు. సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఎంపిపి ఎం.సోని, సర్పంచ్ బందెల భారతి, రవీంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లలో ఫ్లెక్సీల ఏర్పాటు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో అనధికార లేఅవుట్‌లలో స్థలాలు కొన్నవారు, లేఅవుట్ వేసిన వారు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ మేడిద నవీన్ కిరణ్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లోని అనధికార లేఅవుట్ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని లేఅవుట్ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో భూమి ప్రభుత్వ విలువలో 14 శాతం ఉండే ధరావత్తును, ఏడు శాతానికి తగ్గించిందన్నారు. అనధికార లేఅవుట్లో స్థలాలు కొనుగోలు చేసిన వారు లేఅవుట్ వేసి స్థలాలు విక్రయించే వారు ప్రభుత్వం కల్పించిన ఈ తగ్గింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని (ల్యాండ్ రెగ్యులర్ స్కీమ్) ద్వారా అనుమతి పొందాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి యడ్లపల్లి మహేష్, సిబ్బంది ఉన్నారు.

ఇల్లింద్రపర్రులో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - ఇరగవరం

మండలంలోని ఇల్లిందలపర్రు గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం ఇల్లిందలపర్రులో దాళ్వా పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. నారుమడులు వేసి 12 నుంచి 15 రోజులు కావస్తోందని తెలిపారు. దాళ్వా ఉంచడానికి ముందుగా 15 రోజుల ముందు నుంచి దమ్ము చేసుకుని 100 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ట్, యూరియా 20 కేజీలు వేయడం ద్వారా మడులు త్వరగా కుళ్లి భూమికి సేంద్రియ ఎరువుగా మారుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రెడ్డి రామకృష్ణ, గణేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వ గట్లపై ఆక్రమణల తొలగింపు

మొగల్తూరు: సాగునీటి ప్రవాహానికి అవరోధంగా, నీటి కాలుష్య కారకంగా మారిన కాలువ గట్లపై ఆక్రమణల తొలగింపు పనులు మంగళవారం చేపట్టారు. మొగల్తూరులో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ పర్యవేక్షణలో కాలువ గట్టు ఆక్రమించుకుని ఉన్న ఖాళీ తాటాకు పాకలు, పశువుల పాకలు, గట్లు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న వివిధ రకాల కూరగాయల మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కాలువ గట్లు ఆక్రమణల తొలగింపు ద్వారా కాలువ ప్రక్షాళనకు వీలు కలగనుందని, ఆక్రమణదారులకు గతంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ఈ కాలువ నీటిని వినియోగిస్తున్నామన్నారు.

దారి దోపిడీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

ప్రజాశక్తి - నరసాపురం

రాత్రి సమయంలో ప్రజలను అడ్డగించి, భయాందోళనకు గురిచేసి సొత్తు అపహరించిన కేసులో నిందితుడికి న్యాయస్థానం ఏడాది కఠిన కారాగార శిక్ష విధించినట్లు పట్టణ సిఐ బి.యాదగిరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామానికి చెందిన గూడవల్లి కులశేఖర్ తన స్నేహితులతో కలిసి వెళ్తున్నాడు. నరసాపురం పట్టణ పరిధిలో నిందితుడు వారిని అడ్డగించి, దౌర్జన్యంగా కొట్టి సెల్‌ఫోన్, రూ.వెయ్యి నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో తిరుమాని చంద్రశేఖర్ అలియాస్ చక్రధర్‌కు సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. కేసులో విచారణలో కీలకపాత్ర పోషించిన ఎస్ఐలు సిహెచ్.జయలక్ష్మి, ముత్యాలరావు, కోర్ట్ లైజనింగ్ ఎఎస్ఐ కెఎస్.భాస్కర్, కోర్టు కానిస్టేబుల్స్ బి.శ్రీనివాసు, ఎం.వల్లభ రాయుడును ఇన్‌స్పెక్టర్ యాదగిరి అభినందించారు. ప్రజల భద్రత విషయంలో రాజీ పడేది లేదని తెలిపారు. నేరస్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

'దళిత పక్షపాతి రఘురామ కృష్ణరాజు'

ప్రజాశక్తి - ఉండి

దళిత పక్షపాతి అయిన డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజుపై అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ వ్యాఖ్యలు సరికావని ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గొల్ల జాన్ కెనడీ విక్టర్ బాబు అన్నారు. మంగళవారం ఉండిలో విక్టర్‌బాబు, ఉండు అబ్రహం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గంలో కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి ఉంటున్నామని, దాన్ని చెడగొట్టేందుకు కొన్ని రాజకీయ శక్తులు రఘురామ కృష్ణరాజుపై దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. కుల మతాలకతీతంగా పార్టీలకతీతంగా ఆక్రమణలకు పాల్పడిన వారు ఎవరైనా ఒకటేనని వాటిని వెంటనే తొలగించాలని రఘురామ కృష్ణరాజు అధికారులను ఆదేశించారని విక్టర్ బాబు గుర్తు చేశారు. ఆయనను అపహాస్యం చేయడం సరికాదని తెలిపారు.

CHANGE OF NAME

I **MAMIDISETTI SIVA SANKAR** S/o Mamidisetti Peddi Raju, D.No: 1-49, Mamidisetti Vari Meraka, Turpatallu Village, Narasapur Mandal, W.G.Dt, A.P. I have changed my Name from **MAMIDISETTI SIVA SANKAR RAO** (Old Name) to **MAMIDISETTI SIVA SANKAR** (New Name). Henceforth I am being called **MAMIDISETTI SIVA SANKAR** S/o Mamidisetti Peddi Raju for all purposes.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.197/2018

Between:
ముమ్మిడి పెద్దింట్లు ...వాది
మరియు
గంగుల సుబ్బారావు వగైరా ...ప్రతివాద్లు

పై నెంబరు గ్రంథంలో 11వ రెస్పాండెంటు అయిన ముమ్మిడి వుజూరయ్య తండ్రి సుబ్బారావు, యర్రమిల్లిపాడు, ఉంగుటూరు మండలం అను శ్రీకోర్టు వారి నోటీసులు సమన్లు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీరు ది.29.12.2025 సం॥ తేదీ పగలు 10.30 గంటలకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన మూలముగా తెలియచేయడమైనది.
శ్రీకోర్టు వారి వుత్తర్వులు మేరకు

కాజ నాగేశ్వరరావు
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం
సెల్: 99895 38628

ప్రకటన

IN THE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE, BHIMAVARAM

O.S.368/2024

Between:
Plaintiff : Canara Bank, JP Road, Branch, Bhimavaram, Rep by its Branch Manager.
Defedants : M/s.R.S.Vastralayam, Bhimavaram, Rep by its Prop: Nimmala Rama Srinivas and another
1st Defendant Address :
M/s.R.S.Vastralayam, S/o.Venkata Subba Rao, Business, D.No.17-6-14, Mantevari Street, Bhimavaram.
2nd Defendant Address :
Nimmala Rama Srinivas, S/o.Venkata Subba Rao, Business, D.No.17-6-34, Angel cut pices, Mantevari Street, Bhimavaram.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అవి అందుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. వారి తరపున ప్రతివాదులపై శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు ది.30.12.2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
భీమవరం **అత్తి శివరామకృష్ణ,** అడ్వకేట్,
తేది.10-12-2025 శ్రీరాంపురం, భీమవరం.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) - CUM-JUDICIAL I CLASS MAGISTRATE :: NIDADAVOLE

D.V.C.No.6/2024

Between :
Penmetsa Chandini, W/o. Sunil Kumar, D/o. Sagi Sita Rama Raju, Age : 28 Years, Female, Housewife, R/o. D.No.13-21-4/1, Subbarajupeta, Nidadavole Twon and Mandal, E.G.Dist., **...Petitioner**
And
1. Penmatsa Sunil Kumar, S/o. Venkata Subba Raju, Age : 36 Years, Male, Cultivation and Business, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist.,
2. Penmatsa Parvatha Vardhini, W/o. Venkata Subbaraju, Age, 56 Years, Female, Properties, Door No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist.,
3. Uppalapati Annapurna, W/o. Dinesh, Age : 38 Years, Female, Properties, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist.,
...Respondents
R3 : Uppalapati Annapurna, W/o. Dinesh, Age 38 Years, Female, Properties, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, W.G.Dist.,
యీ నెంబరులో 3వ రెస్పాండెంటు దావా సమను కోర్టు ద్వారాను రిజిష్టర్డు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపించినా అమలు జరగనందున శ్రీ కోర్టువారి వుత్తర్వుల ప్రకారం యీ ప్రకటన చేయడమైనది.
R3 : Uppalapati Annapurna, W/o. Dinesh, Age 38 Years, Female, Properties, D.No.7-30, Pippara, Ganapavaram Mandal, Ganapavaram P.S.Limits, W.G.Dist., అను వారు **ది.07-01-2026 తేదీన** పై కోర్టు వారు పిలిపించే టైముకు ఉదయం గం.10.30 లకు స్వయంగా కానీ ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరుచుకొనవలెను లేని యెడల ఎక్స్‌పార్టీ చేసి పరోక్షమున తీర్మాణించడమగును.

P.Venkanna Babu, B.Com, B.L.,
Advocate, Nidadavole,
E.G.Dist., Cell : 93476 26143

వేలం ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ఫస్ట్ ఎడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో భీమవరం

ఇ.పి.నెంబరు 5/2024 ఇన్
ఓ.యస్.నెం.36/2021

బిట్వీన్ :
అల్లు శ్రీనివాసరావు, S/o.పాండురంగారావు, నివాసం డో.నెంబరు.22-9-6, నంబులవారి వీధి, భీమవరం-1, భీమవరం మండలం, ప.గో.జిల్లా. ...డి.హెచ్.ఆర్.
మరియు
శ్రీమతి డొక్కు వెంకటలక్ష్మి, W/o.లేటు మారియ్యా, నివాసం డోరునెం.6-18, రామాలయం వద్ద, గరువు పాలకోడేరు గ్రామం మరియు మండలం, ప.గో.జిల్లా. ...జె.డి.ఆర్.

వేలం ఆస్తి వివరము :

పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా కాళ్ళ మండలం బొండాడ గ్రామం ఆర్.ఎస్.నెంబరు 12/1లో చ.గ. 482.88లులో దక్షిణం వైపు చ.గ. 121 లు గల పైన తెలిపిన జెడిఆర్ యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో ఉండి యీ డిక్రి బాకీ క్రింద జప్తు కాబడి వేలం కావలసియున్న ఆసిక్తి హద్దులు :
తూర్పు : గొర్ల వెంకట కరుణ కృష్ణ కుమారి గారి స్థలం.
పడమర: రాజవీధి
ఉత్తరం : కోరశిఖ వేంకటేశ్వరరావు స్థలం మరియు ఇతరులు
దక్షిణం : రాజవీధి
డి.హెచ్.ఆర్.విలువ : రూ.5,79,000/-
అమీన విలువ : 9,00,000/-

పైన తెలిపిన ఆస్తి శ్రీకోర్టు వారు ది.19-01-2026 సం॥ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు బహిరంగ వేలము వేయుదురు.
కావున కావలసిన వారు పాడుకొనవచ్చును.
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతో సహా హాజరు కావలెను.

ఇంజేటి వెంకటేశ్వర్లు
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది
భీమవరం భీమవరం.
తేది.23.12.2025 సెల్: 9441155455